క్లుప్తంగా

అధినేతతో విజయానందరెడ్డి



చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి కలిశారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం మాజీ సీఎంను కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు విషయాలపై ముచ్చటించారు.

గణపయ్య సేవలో పునర్నిర్మాణ దాతలు



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని బుధవారం ఆలయ పునర్నిర్మాణ దాతలు దర్శించుకున్నారు. దాతలు ఐకా రవి, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్‌రాగా వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

ముగ్గురిపై కేసు

చిత్తూరు అర్బన్: మద్యంషాపు సేల్స్‌మన్‌పై దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి నగరంలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు, నగరానికి చెందిన అజిత్, కుమార్, అనిల్ దర్గా వద్ద ఉన్న సుకుమార్ వైన్‌షాపులో మద్యం తాగడానికి వచ్చారు. మద్యం తీసుకుని పక్కనే ఉన్న గదిలో పెద్ద ఎత్తున అరుస్తూ తాగడం ప్రారంభించారు. అక్కడే ఉన్న సేల్స్‌మన్ రవికుమార్ అలా చేయద్దని చెప్పడంతో పిడిగుద్దులు గుద్దారు. అతను షాపులోకి వెళ్లి గేటువేసుకున్నా బయట నుంచి రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో రవికుమార్‌కు తీవ్రగాయలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ బోల్తా

గుడిపాల: ఓ లారీ బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, బెంగళూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ బుధవారం రాత్రి మద్రాస్ క్రాస్ రోడ్డు వద్ద కుప్పగా పోసిన కాంక్రీట్ రాళ్లను ఢీ కొని బోల్తాపడింది. తమిళనాడు లోని సేలంకు చెందిన పలనివేల్(50) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సారా ఊట ధ్వంసం

గుడిపాల: మండలంలోని అటవీప్రాంతంలో భారీగా సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. రాసనపల్లె అటవీప్రాంతంలో సారా తయారుచేస్తున్నారని సమాచారం రావడంతో బుధవారం సిబ్బందితో వెళ్లి దాడులు చేయడం జరిగిందన్నారు. ఇందులో సారా ఊట 800 లీటర్లను ధ్వంసం చేశామని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం బొమ్మనచేను గ్రామంలో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ పవన్, జవహర్ దాడులు చేయగా గోవిందు అనే వ్యక్తి వద్ద నుంచి కర్ణాటకమద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ఘనంగా పడి పూజ



గుడిపాల: మండలంలోని వసంతాపురంలో బుధవారం రాత్రి అయ్యప్ప భక్తులు ఘనంగా పడికెట్ల పూజను ఘనంగా నిర్వహించారు. 18 పడికెట్లు పెట్టి అయ్యప్పస్వామి చిత్రపటాలను ఉంచి దీపారాధన చేసి వైభవంగా పూజలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పాటలను భక్తులు పాడారు. చుట్టుపక్కల గ్రామాల్లోని అయ్యప్పస్వాములు పడికెట్ల పూజలో పాల్గొని వారివారి మొక్కులను చెల్లించుకున్నారు. వసంతాపురానికి చెందిన అయ్యప్పస్వామి భక్తులు పడికెట్ల పూజను నిర్వహించి వచ్చిన వారందరికీ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

హరిశ్చంద్రుని ఆలయం పునఃప్రారంభం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని హరిశ్చంద్రుని ఆలయాన్ని గురువారం పునఃప్రారంభించారు. కైలాశపురానికి వెళ్లే దారిలో ఉన్న సత్య హరిశ్చంద్రుని ఆలయాన్ని స్థానిక భక్తులు లక్ష్మణ్, జ్యోతిబాబు ఇద్దరు కలిసి పునర్నిర్మించారు. అనంతరం స్థానిక భక్తులంతా కలిసి ఇక్కడ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.



పంట చేతికొస్తున్న సమయంలో అన్నదాతకు కంటిమీద కునుకు ఉండదు. కన్న బిడ్డలాగా పంటను కాపాడుకున్నా పంట ఇంటికొస్తుందన్న గ్యారంటీ లేదు. ప్రస్తుతం వరి పంటకు తెగుళ్ల బెడద తప్పడం లేదు. మొగ్గ దశలో ఉన్న పంటను అగ్గి తెగులు బుగ్గి చేస్తోంది. ఎన్ని రకాల పురుగు మందులు కొట్టినా తగ్గుముఖం పట్టడం లేదు. ఈ తెగులు నివారణకు రైతులు నానా అవస్థలు పడుతుంటే, మరోవైపు మంచు తెగులు ముంచుకొస్తోంది. ఇలా రెండు రకాల తెగుళ్లు అన్నదాతను నట్టేట ముంచేస్తున్నాయి.



తడకర వద్ద అగ్గితెగులు సోకిన వరి పంట

అగ్గి.. వరి బుగ్గి!

- పురుగుమందులు కొట్టినా తగ్గని వైనం
- మరోవైపు ముంచేస్తున్న మంచు తెగులు
- పంటను కాపాడుకోవడానికి ఆపసోపాలు
- రబీ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం 350 ఎకరాలు

తవణంపల్లె: మండలంలో ఈ సీజన్‌లో వరి పంటను అధికంగా సాగు చేశారు. వాణిజ్య పంటగా సాగు చేసే వరి పంటకు అగ్గి తెగులు, మంచు తెగులు సోకింది. మొదట్లో అక్కడక్కడ కనిపించిన అగ్గి తెగులు ఇప్పుడు అధిక భాగం విస్తరించింది. ఎన్నిసార్లు పురుగుల మందులు కొట్టిన తగ్గుముఖం కనిపించడం లేదు. ఇంతలోనే మంచు తెగులు కొద్దికొద్దిగా పాకుతోంది. వ్యవసాయాధికారులు సూచనలు పాటించినప్పటికీ ఉపయోగం లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే వరి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడమూ ఈ తెగులుకు కారణమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీంతోపాటు రైతులకు అవగాహన లేకపోవడంతో మోతాదుకు మించి మందులు, ఎరువుల వాడకం వల్ల పంట దెబ్బతింటోంది. వరిని అన్ని రకాల నేలల్లో రైతులు సాధారణ పద్ధతిలో పండిస్తున్నారు. కానీ భూమిని బాగా దుక్కి దున్ని సేంద్రియ ఎరువులు వాడడం వల్ల దిగుబడి బాగా వస్తుంది. తవణంపల్లె మండలంలో ఈ రబీ సీజన్‌లో 350 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇక ముందు సాగు చేయాల్సిన రైతులు ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

విత్తన శుద్ధి

- జీవ నియంత్రణ పద్ధతిలో కిలో విత్తనానికి 8 గ్రాములు సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ అనే శిలీంద్ర నాశినితో శుద్ధి చేయాలి.
- కిలో విత్తనానికి కార్బండిజం మందు 4 గ్రాములు కలుపుకొని 24 గంటల తర్వాత నారు మడిలో చల్లాలి.
- మంచి దిగుబడి నిచ్చే విత్తనాలు ఎంపిక చేసుకోవాలి.
- రబీ సీజన్‌లో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కనుగుణంగా బిపిటి 5204 రకం (సాంబ మసూరు), ఎన్‌ఎల్‌ఆర్ 34449 (నెల్లూరు మసూర) సన్న రకాలు, ఎడిటి-37 వంటి రకాలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది.

తెగుళ్లు - నివారణ చర్యలు

వరి పంటను కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగులు ఆశిస్తాయి. వాటి నివారణకు కాంటాఫైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను ఎకరాకు 8 కిలోలు చల్లుకోవాలి. అధికంగా వ్యాపిస్తే 400 గ్రాములు కాంటాఫైడ్రోక్లోరైడ్ మందులను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. అగ్గి తెగుళ్ల నివారణకు ట్రైసైక్లోజోన్ మందును 0.6 గ్రాములు లేక 1 గ్రాము కార్బన్‌డైజం మందును లీటరు నీటిలో కలిపి పిచకారి చేయాలి. బ్యాక్టీరియా మంచు తెగుళ్ల నివారణకు యూరియా వాడకాన్ని తగ్గించుకొని, పొటాషియం ఎరువును వాడాలి.

సమగ్ర పోషక యాజమాన్యం

- వరి అధిక దిగుబడి సాధించాలంటే పోషక పదార్థాల యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.
- భూసార పరీక్షలను బట్టి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వాడాలి.
- సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట పైర్లు(జనుము, జీలుగ) వేసుకోవడం వల్ల మంచి పోషకాలు లభిస్తాయి.
- నత్రజని ఎరువును మూడు లేక నాలుగు దఫాలుగా వేసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.
- భాస్వరం ఎరువును దుక్కిలో వేసుకోవాలి. పొటాష్ ఎరువును యూరియాతో కలిపి రెండు దఫాలుగా వేయాలి. కాంప్లెక్స్ ఎరువులు పైపాటుగా వేయరాదు.
- ఆఖరి దుక్కిలో 20 కిలోల జింకు సల్ఫేటు ఎకరాకు వాడాలి.

కాలి బాటలు వదలాలి

వరినాట్లు వేసేటప్పుడు ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్లకు చొప్పున తూర్పు, పడమర దిశలో కాలి బాటలు వదలాలి. దీని వల్ల దోమపోటును నివారించవచ్చు. ఎరువులు, పురుగుల మందు వాడకానికి అనుకూలంగా ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులు రబీ సీజన్‌లో వరి పంట సాగు చేసే రైతులు యాజమాన్య సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. విత్తన శుద్ధి తప్పక చేయాలి. వరి నాట్లు వేసేటప్పుడు 2 మీటర్లకు 20 సెంటీమీటర్లు కాలిబాటలు వదలాలి. పొటాష్ ఎరువులు వాడితే తెగుళ్ల తట్టుకొని మంచి దిగుబడి వస్తుంది. ముందస్తుగా సాగు చేసిన రైతులకు ఎకరాకు సుమారు 30 బస్తాలు దిగుబడి వచ్చింది.

–జి.ప్రవీణ్, ఏఓ, తవణంపల్లె

పంట దెబ్బతినింది



వరి పంటను రకరకాల పురుగులు, తెగుళ్లు ఆశించడంతో బాగా దెబ్బతినింది. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించినా చీడపీడలు తగ్గడం లేదు. దీంతో పురుగు మందులు వాడాల్సి వస్తోంది. వీటి కొనుగోలుకు పెట్టుబడి ఎక్కువ అవుతోంది. వాతావరణం అనుకూలించకపోవడంతో పురుగులు అధికమవుతున్నాయి. ఏం చేయాలో పంటను ఎలా కాపాడుకోవాలో తెలియడంలేదు.

–భాస్కర్ రెడ్డి, రైతు వెంగంపల్లె

అధిక దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలి



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: రైతులు అధిక దిగుబడి వచ్చే పంటలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసార పరీక్షలు చేసుకొని తదనుగుణంగా పంటలు సాగు చేయడం మంచిదన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. పంటల సాగులో అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ, మార్కెటింగ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

కాణిపాకం: కాణిపాక పుణ్యక్షేత్రంలో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే చర్యలు తప్పవని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు హెచ్చరించారు. కాణిపాకంలో బుధవారం లాడ్జి యజమానులతో సమావేశం నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తే లాడ్జి యజమానులపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. లాడ్జీలను ఆశ్రయించే యాత్రికుల ఆధార్ కార్డు, తగిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. అపరిచిత వ్యక్తులకు గదులు ఇవ్వరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ ధరణీధర ఉన్నారు.




వరసిద్ధుని సేవకు క్యూ

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు స్వామీ..ఏంటీ ఈ నిరీక్షణ అంటూ ఆవేదనకు గురవుతున్నారు. ఇక్కడకు స్వామి దర్శనార్థం నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఉచిత దర్శనానికి అధిక సంఖ్యలో క్యూ కడుతుంటారు. ఇంత వరకు బాగానే ఉన్న అభిషేక సమయంలో భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. క్యూ కాంప్లెక్స్ ఉన్నప్పటికీ అక్కడ వారిని కూర్చోబెట్టకుండా రోడ్డుపైనే గంటల కొద్దీ నిలబెడుతున్నారు. దీంతో భక్తులు నిల్చోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా వృద్ధులు నీరసించిపోతున్నారు. ఇలా తమకు ఎండలో ఎందుకు పరీక్ష పెడుతున్నారని భక్త జనం మండిపడుతోంది. –కాణిపాకం

నేత్రపర్వం.. కల్యాణోత్సవం

కాణిపాకం: కార్తీక బహుళ పంచమిని పురస్కరించుకుని కాణిపాకంలోని సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయకస్వామి కల్యాణోత్సవం, ప్రాకారోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ కల్యాణవేదికలో పుష్ప పందిరి వేసి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు కానుకలు సమర్పించారు. ఉత్సవం తర్వాత పల్లకిలో స్వామి వారిని ఊరేగించారు.





కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకులు

నివేదికలు సకాలంలో అందజేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

ఐరాల: కలెక్టర్ కార్యాలయానికి, రెవెన్యూ డివిజనల్ అధికారులకు సమర్పించాల్సిన నివేదికలను, కోర్టు కేసులకు సంబంధించిన కౌంటర్లు సకాలంలో దాఖలు చేయాలని ఆర్‌డీఓ శ్రీనివాసులు తహసీల్దార్ మహేష్‌కుమార్‌ను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యలయాన్ని బుధవారం ఆర్‌డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలు, గ్రామ సభల్లో వచ్చిన అర్జీలు, ఫ్రీహోల్డ్ హక్కులకు అందించిన దరఖాస్తు భూములకు సంబంధించి జరుగుతున్న పునర్విచారణ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గిరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలపై రాజకీయ వేధింపులు తగవు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు

చిత్తూరు కలెక్టరేట్ : వెలుగు వీవోఏ (యానిమేటర్స్) పట్ల కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని వీవోఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీవోఏ, సీఐటీయూ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయనతో పాటు సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీవోఏలను కారణం లేకుండానే జిల్లాలో దాదాపు వంద మందికి పైగా వీవోఏలను తొలగించారన్నారు. న్యాయస్థానం స్టే ఇచ్చినా వీవోఏలను విధుల్లోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో వీవోఏల సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వెలుగు వీవోఏ (యానిమేటర్స్) సంఘ నాయకులు, వీవోఏలు పాల్గొన్నారు.

'నా భార్య ఆచూకీ ఏదీ?

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నా భార్య ఆచూకీ తెలపాలంటూ బంగారుపాళెం మండలం తిమ్మోజుపల్లి కాలనీకి చెందిన రఘువర్మ వేడుకున్నాడు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన తన ఇద్దరు పిల్లలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మదుపోలూరుకు చెందిన చంద్రశేఖర్ నాయుడు కుమార్తె బిర్లాను ఆరేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపాడు. కులాంతర వివాహం నేపథ్యంలో అత్తమామలు తన భార్యను కిడ్నాప్ చేశారన్నాడు. దీంతో పిల్లలు తల్లి కోసం దిగులు చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు స్పందించి తన భార్యను అప్పగించి తనకు న్యాయం చేయాలని కోరాడు.



ఉర్దూ పాఠశాలల బలోపేతానికి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఉర్దూ డీఐ అఫ్సర్ ఖాన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల బలోపేతానికి నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అఫ్సర్ ఖాన్ ఆదేశించారు. బుధవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉర్దూ సీఆర్‌సీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉర్దూ స్కూళ్లలో విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి రోజూ స్కూల్‌కు హాజరయ్యేలా శ్రద్ధ వహించాలని, అలాగే గైర్హాజరయ్యే విద్యార్థులపై దృష్టి సారించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పలువురు ఉర్దూ టీచర్లు పాల్గొన్నారు.

తవణంపల్లెలో కానరాని వారోత్సవాలు



తవణంపల్లె శాఖ గ్రంథాలయం

తవణంపల్లె: మండల కేంద్రంలో పాఠకులతో కళకళలాడే తవణంపల్లె శాఖ గ్రంథాలయం కళ తప్పింది. గతంలో జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిన గ్రంథాలయం ప్రస్తుతం అధ్వానంగా మారింది. గ్రంథాలయానికి పాఠకులు వచ్చినా అందుబాటులో గ్రంథాలయ అధికారి లేకపోవడంతో నిరుత్సాహపడుతున్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. తవణంపల్లెలో మాత్రం వారోత్సవాలు నిర్వహించలేదు. ఆదర్శవంతంగా వెలుగొందిన ఈ గ్రంథాలయం గురించి జిల్లా గ్రంథాలయ అధికారులు సైతం పట్టించుకోకపోవడం శోచనీయం. గ్రంథాలయంలోని కంప్యూటర్లు తుప్పు పట్టిపోతున్నాయి. గ్రంథాలయ భవనం బూజుతో నిండిపోయి పరిసరాలు సైతం అపరిశుభ్రంగా మారాయి. దీనికి శాశ్వత గ్రంథాలయ అధికారిని నియమించకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని పాఠకులు అనుమానిస్తున్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



చిత్తూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శర్మ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమం బుధవారం ముగిసింది. జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శర్మ మాట్లాడారు. నీతి కథలను విద్యార్థులకు ఆయన తెలియజేశారు. ధనాన్ని దొంగిలించవచ్చు, కానీ జ్ఞానాన్ని దోచుకెళ్లడం ఎవరితరం కాదని వివరించారు. డిజిటల్ లైబ్రరీలపై విశ్రాంత అధ్యాపకులు బాలకృష్ణారెడ్డి తెలియజేశారు. పలు రకాల పుస్తకాల గురించి ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక నాయకులు మునస్వామి మాట్లాడారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రరియన్ లలిత, సహాయ డిప్యూటీ లైబ్రరియన్ గజేంద్రబాబు, సిబ్బంది గుణశేఖర్ పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

బంగారుపాళెం: గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధనంజయరాజు అన్నారు. స్థానిక గ్రంథలయంలో బుధవారం గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు సుశీల, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

తీర్చిదిద్దేవి గ్రంథాలయాలు

ఐరాల: విద్యార్థులను మహనీయులుగా తీర్చిదిద్దేవి గ్రంథాలయాలు అని స్థానిక గ్రంథాలయాధికారిణి సుజాత అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పోటీల్లో విజేతలకు హెడ్ కానిస్టేబుల్ బాబయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, భరత్‌కుమార్, కానిస్టేబుల్ జ్యోతికుమార్ పాల్గొన్నారు.

పూతలపట్టు: విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలను చదివి జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవాలని తహసీల్దార్ గుర్రప్ప తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయ పుస్తకాలను చదవడంతో భవిష్యత్తులో పోటీ పరీక్షలు రాసే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మనోహర్, అధ్యాపకులు సత్యనారాయణ, గ్రంథాలయాధికారి రవీంద్రబాబు పాల్గొన్నారు.

దోమల నివారణతో అంటువ్యాధులు దూరం

బంగారుపాళెం: దోమల నివారణతో అంటువ్యాధులు దూరమని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ అన్నారు. మలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి తుంబకుప్పం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నైట్ బ్లడ్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారుపాళెం–1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో 500 మందికి రక్తపూత నమూనాలను సేకరించారు. నైట్ బ్లడ్ సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లో నివాస గృహాలు, వీధులు పక్క చెత్తదిబ్బలు, నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. సిబ్బందికి బ్లడ్ శ్యాంపిల్ సేకరణపై పలుసూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో ఏఎంఓ రామచంద్రారెడ్డి, తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ రమేష్, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నైట్ బ్లడ్ సర్వేపై సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్